క్లుప్తంగా

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటింటికీ వైద్యసేవలు

తెర్లాం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సేవలు సద్వినియోగం చేసుకోవాలని తెర్లాం పీహెచ్‌సీ వైద్యురాలు దీక్షితారాణి కోరారు. మండలంలోని గొలుగువలస గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలోని రోగులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతీ ఇంటికి వైద్యసేవలు అందాలన్న సదుద్దేశ్యంతోనే ప్రభుత్వం ఈ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం తీసుకువచ్చిందని, ఇది ఎంతో గొప్ప కార్యక్రమమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు జి.శంకరరావు, వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

రామభద్రపురం: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించరాదని మండల ప్రత్యేకాధికారి గోవిందరావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల్లో అభివృద్ధి పనులు చురుగ్గా జరిగేలా, అర్హులకే సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాసమస్యలు పరిష్కరించడంలోనూ చురుగ్గా ఉండాలన్నారు. వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తల పనితీరు బాగోలేదని, పనితీరు మెరుగుపరుచుకోకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి, అభివృద్ధి పనుల పురోగతిని పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమామణి, తహసీల్దార్ రాజారావు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం


కాలిపోయిన గడ్డివాము

వంగర: మండలంలోని కొప్పర గ్రామ సమీపంలో ఓ రైతుకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. శనివారం అక్కడి నువ్వుపంట తొక్కుకు అంటించిన నిప్పు గాలికి వ్యాప్తి చెందడం ద్వారా గడ్డివాముతో పాటు కొట్టిశ, లక్ష్మీపేట గ్రామాలకు వెళ్లే తాగునీటి సరఫరా మోటార్ వైర్లు కూడా కాలిపోయాయి.

బొబ్బిలి: పట్టణంలోని కోరాడ వీధిలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో బంకురు రవి అనే పాడి రైతుకు చెందిన గడ్డివాములు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జేసీఎస్ ఇన్‌చార్జ్ రెజేటి ఈశ్వరరావు(విస్సు) సంఘటన స్థలానికి చేరుకుని, బాధితుడిని పరామర్శించి, పరిస్థితిని సమీక్షించారు.

నవధాన్యాల సాగుతో నేలసారవంతం


నవధాన్యాల కిట్లతో రైతులు

రాజాం సిటీ: ఖరీఫ్ పంటలకు ముందుగానే నవధాన్యాలు సాగు చేయడం ద్వారా నేలసారవంతం కావడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారిణి ఎం.రేణుకాసాయి తెలిపారు. శనివారం మండలంలోని నందబలగ గ్రామంలో రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. నవధాన్యాల సాగుతో పంటకు కావాల్సిన పోషకాలు అధికంగా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె. ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ బి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాళీ స్థలాల పరిశీలన


ఖాళీ స్థలాల పరిశీలనలో ఆర్‌డీఓ అప్పారావు తదితరులు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలను చీపురుపల్లి ఆర్‌డీఓ ఎం.అప్పారావు, తహసీల్దారు టి.కల్యాణచక్రవర్తి కలిసి శనివారం పరిశీలించారు. వండానపేట గ్రామస్తులు కొంతమంది తమకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జెడ్పీ చైర్మన్ ఆదేశాల మేరకు జేసీ మయూర్ అశోక్ సూచనలతో ప్రభుత్వ ఖాళీ స్థలాలపై ఆరాతీస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గుళ్లపాడు సర్పంచ్ చక్రపాణి, ఎంపీటీసీ గౌరునాయుడు పాల్గొన్నారు.

సచివాలయంలో రిజిస్ట్రేషన్లపై హర్షం

బొబ్బిలి: మండలంలోని ఎం.బూర్జివలస గ్రామ సచివాలయంలో భూములకు సంబంధించి, రిజిస్ట్రేషన్లు జరుగుతుండడంపై గ్రామస్తులు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకు ఈ రిజిస్ట్రేషన్ల కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, సచివాలయాల పుణ్యమా అని గ్రామంలోనే లంచాలకు తావులేకుండా పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు జరుగుతుండడం చాలా ఆనందంగా ఉందంటున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు


మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోదుగులపేట సచివాలయం పరిధిలోని గోవిందపురం గ్రామంలో శనివారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రతీ సామాన్యుడి ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందుకే పక్కా ఇల్లు, సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. కోవిడ్ కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలు ఆగలేదన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ప్రతీ పేదింటికి మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. ఇప్పటివరకు అమలైన పథకాల్లో ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు.

ఇదే జగనన్న ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. మరో వైపు రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. పోర్టులు, విమానాశ్రయాలు, ఆస్పత్రుల ఏర్పాటు వంటి వాటితో పాటు ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలు చూసి ఓర్వలేకనే చంద్రబాబు అండ్ కో.. ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మరోసారి అందరూ సీఎం జగనన్నను మళ్లీ సీఎంను చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ రాగోలు రమేష్‌నాయుడు, ఎంపీటీసీ వి.వెంకటేశ్వరనాయుడు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు జి.కేసరి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ జి.వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శనివారం సత్కరించారు. మండల స్థాయిలో పాఠశాలల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయుల చేతులమీదుగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రశంసాపత్రం, మెడల్ అందజేశారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో జీవితంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని వక్తలు ఆకాంక్షించారు. మిగతా విద్యార్థులు కూడా సన్మాన గ్రహీతలను ఆదర్శంగా తీసుకుని, స్ఫూర్తి పొందాలన్నారు.

– బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్


తెర్లాం: లోచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలుకు సత్కారం


రామభద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను సన్మానిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, సర్పంచ్ ఈశ్వరరావు


బాడంగి: గురుకుల పాఠశాలలో విద్యార్థులను సన్మానిస్తున్న ఎంపీపీ గౌరి, జెడ్పీటీసీ రామారావు


బొబ్బిలి: పారాది జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యానికి ప్రశంసాపత్రం అందిస్తున్న ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది


రాజాం: కంచరాం స్కూల్‌లో జగనన్న ఆణిముత్యానికి ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం


రేగిడి: ఉంగరాడమెట్ట గురుకుల పాఠశాలలో విద్యార్థి రామ్‌చరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, సిబ్బంది


సంతకవిటి: గుళ్లసీతారాంపురంలో సన్మాన గ్రహీతలతో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు

పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- బొబ్బిలి పశుసంవర్థక శాఖ డీడీ రెడ్డి నీలయ్య


అవగాహన కల్పిస్తున్న బొబ్బిలి పశుసంవర్థక శాఖ డీడీ నీలయ్య

రాజాం సిటీ: వైఎస్సార్ పశుబీమా పథకాన్ని పాడి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని బొబ్బిలి పశుసంవర్థక శాఖ డీడీ రెడ్డి నీలయ్య కోరారు. శనివారం స్థానిక పశుసంవర్థక శాఖ కార్యాలయంలో రైతులు, సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లకు పథకంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతుకు ఐదు పశువులు వరకు బీమా చేయించుకునే అవకాశం ఉందన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా ప్రభుత్వం కొత్తగా ఎద్దులు, పందులకు కూడా బీమా వర్తింపజేస్తోందన్నారు. రైతులు తమ వాటా కింద 20 శాతం చెల్లిస్తే, మిగిలిన 80 శాతం వాటా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైతు మూడేళ్ల కాలానికి ఒక్కో దానికి రూ.384 చెల్లించాల్సి ఉంటుందని, దేశీయ పశుజాతికి సంబంధించి రూ.480 చెల్లించాల్సి ఉంటుందన్నారు. జెర్సీ, హెచ్‌ఎఫ్ వంటి పశువులకు రూ.30 వేలు బీమా వర్తింపుతో పాటు, నాటుఆవులు, ఎద్దులకు సంబంధించి ఒక్కోదానికి రూ. 15 వేలు వస్తుందన్నారు. అలాగే గొర్రెలకు సంబంధించి, 50 గొర్రెల వరకు వర్తిస్తుందన్నారు. పశువులు మరణించిన 21 రోజుల్లోపే సంబంధిత రైతుల ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న గోకులాలకు నిధులు జమచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజాం, సంతకవిటి ఏడీలు బి.జయప్రకాష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ రైతు పక్షపాతి

- మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు


రాజాం: రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అప్పారావు


రేగిడి: వెంకమ్మపేట రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు విత్తనాల పంపిణీ


రాజాం సిటీ: రైతులకు ఎరువులు అందజేస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు అన్నారు. శనివారం మండలంలోని ఆగూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ అధికారంలోకి రాగానే రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించిందన్నారు. టీడీపీ హయాంలో విత్తనాల కోసం కొన్నిరోజుల తరబడి పీఏసీఎస్ కేంద్రాలు, మండల వ్యవసాయ కార్యాలయాల వద్ద క్యూలో ఉంటే తప్ప విత్తనాలు దక్కేవి కావన్నారు. పండిన పంటను కూడా విక్రయించుకోలేక దళారులకు ఇస్తే వారు అన్నదాతలను మోసగించేవారన్నారు. ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను సకాలంలో సరఫరా చేయడంతో పాటు పంట కూడా నేరుగా రైతు విక్రయించుకునేలా చర్యలు తీసుకుంటోందన్నారు. అంతేకాకుండా రైతు భరోసా పథకం కింద సాగుకు ఆర్థికసాయం, పంటల బీమా, పశు బీమా కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామ వీఆర్‌ఓ రత్నమాల, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎస్.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని వెంకమ్మపేట, తునివాడ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద విత్తనాల పంపిణీ శనివారం చేపట్టారు. మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో సర్పంచ్‌ల చేతులమీదుగా రైతులకు వీటిని అందజేశారు.

రాజాం సిటీ: మండలంలోని పెనుబాక గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద జెడ్పీటీసీ బండి నర్సింహులు చేతులమీదుగా శనివారం రైతులకు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశారు. రైతులకు ఎరువులు, పురుగు మందులు, అందుబాటులో ఉన్నాయని, పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి తొలుత వీటిని అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.కృష్ణ, జి.అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు శనివారం విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మజ్జి శ్యాంసుందరరావు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: విత్తనాల పంపిణీలో ప్రజాప్రతినిధులు, అధికారులు

'జగనన్న సురక్ష శిబిరాలు' ను విజయవంతం చేయండి


మెంటాడ: మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమ్

తెర్లాం/రామభద్రపురం/బాడంగి/బొబ్బిలి/మెంటాడ/సంతకవిటి/వంగర/ రాజాం: ఈ నెల 23వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్న జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంపై అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాసమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా జూలై 1వ తేదీ నుంచి గ్రామ సచివాలయాల వారీగా 4 వారాల పాటు జరుగుతోందని అధికారులు తెలిపారు. గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి అధికారులు ప్రతీ ఇంటికి వెళ్లి, దాదాపు తొమ్మిది రకాల సేవలపై ఆరాతీసి, సేవల్లో ఏవైనా సమస్యలుంటే తక్షణమే పరిష్కరిస్తారు. దీంతో పాటు ప్రజలు సమర్పించిన వినతిపత్రాలు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. అలాగే కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ సీడింగ్, పంట సాగు హక్కుపత్రాలు అందజేయనున్నారు.

ఆసరా నగదు జమ ప్రారంభం


పిరిడి ఏపీజీవీబీ బ్యాంకు సిబ్బందితో మాట్లాడుతున్న ఏరియా కో–ఆర్డినేటర్ లక్షుంనాయుడు

బొబ్బిలి: మండలంలోని పిరిడి ఏపీజీవీబీ(ఆంధ్రప్రదేశ్ విశాఖ గ్రామీణ బ్యాంక్) మేనేజర్ ఆసరా డబ్బులు జమ చేయడం లేదని ఆరోపిస్తూ డ్వాక్రా మహిళలు శుక్రవారం ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ మేరకు స్పందించిన ఏరియా కో–ఆర్డినేటర్ కె.లక్షుంనాయుడు శనివారం బ్యాంకుకు చేరుకుని, సిబ్బందితో చర్చలు జరిపారు. అనంతరం మొత్తం 212 సంఘాలకు సంబంధించి, నగదును జమ చేసే ప్రక్రియను ప్రారంభించారు. సోమవారం నాటికి పూర్తి స్థాయిలో లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తామని అధికారులు తెలిపారు.

ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- మండల ప్రత్యేకాధికారి వి.లక్ష్మణరావు, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ


సూచనలిస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు

తెర్లాం: ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని మండల ప్రత్యేకాధికారి వి.లక్ష్మణరావు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఎందుకు పరిష్కరించలేకపోయారో అర్జీదారునికి తెలియజేయాలన్నారు. మండలంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జూలై నాటికి మండలంలో ఇళ్ల నిర్మాణాలన్నీ పూర్తి చేయాలని, గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ లో–ఓల్టేజి సమస్య కూడా రాకుండా చూడాలన్నారు. పని కావాలని కోరిన ప్రతీ వేతనదారునికి ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలన్నారు. మనబడి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లో జరుగుతున్న పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ రత్నకుమార్, ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీఓ కె.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యాకానుక(జేవీకే) కిట్ల పంపిణీ శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారుల చేతులమీదుగా విద్యార్థులకు వాటిని అందజేశారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఏటా జేవీకే పథకం ద్వారా రూ.2,500 విలువైన కిట్(ఓ స్కూల్ బ్యాగు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, 3 జతల యూనిఫాం, బూట్లు, రెండు జతల సాక్సులు)ను ప్రతీ విద్యార్థికి అందించడం జరుగుతోందని వక్తలు తెలిపారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్


బాడంగి: గురుకుల పాఠశాలలో విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేస్తున్న ఎంపీపీ గౌరి, జెడ్పీటీసీ రామారావు, ఎంపీటీసీ శ్రీనివాసరావు


రేగిడి: ఏవీపురం పాఠశాలలో జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు


రాజాం: గడిముడిదాం గ్రామంలో జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ రాజగోపాలనాయుడు

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి


రేగిడి: చిన్నకోడిశ గ్రామంలో ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ యంత్రం ద్వారా వరి ఎదలు వేస్తున్న దృశ్యం

రేగిడి:

వ్యవసాయంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని, తద్వారా శ్రమ, పెట్టుబడి తగ్గి, అధిక దిగుబడులు సాధ్యమవుతాయని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ బి.లక్ష్మీనరసింహమూర్తి అన్నారు. శనివారం మండలంలో చిన్నకోడిశ గ్రామంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతు నెల్లి నారాయణరావు పొలంలో ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ యంత్రం ద్వారా పొడి వరి ఎదసాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

తొలిసారి నిర్వహించిన ఈ పద్ధతిని రైతులు ఆసక్తిగా తిలకించారు. మండలంలో రెండు యంత్రాలను అందుబాటులో ఉంచామని, రైతులు వినియోగించుకోవాలని కోరారు. వీటి ద్వారా రైతులు ఎదపంటను సాగుచేయవచ్చన్నారు. యంత్రాలు అవసరమైన రైతులు 9985542147 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త శరత్‌బాబు, రైతులు పాల్గొన్నారు.